క్లుప్తంగా

అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు ఆహ్వానం



మంత్రి రోజాకు ఆహ్వానం పలుకుతున్న అంబేడ్కర్ సంఘ నాయకులు

నగరి : వడమాలపేట మండల కేంద్రంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలకు ఆ సంఘ నాయకులు మంత్రి ఆర్కే రోజాను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. బుధవారం మంత్రిని కలిసిన వారు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పూడి జయంత్‌బాబు, ట్రెజరర్ గణేష్ కుమార్, డేవిడ్, మునిబాబు, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న గౌడసంఘం సభ్యులు

శ్రీరంగరాజపురం : గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరించాలని మండల గౌడసంఘం అధ్యక్షుడు భూపతి బుధవారం తహసీల్దార్ లోకనాథ పిళ్లెకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కొంతమంది ఇంటి స్థలాలు లేవని, వారికి స్థలం కేటాయించి తో ప్పాటు అందించాలని విన్నవించారు. అనంత రం తహసీల్దా ర్ స్పందిస్తూ గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారంతో పాటు పండ్లను అందుకున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఉచితంగా పౌష్టికాహారంతో పాటు పండ్ల ప్యాకెట్‌ను సైతం పంపిణీ చేశారు. మంత్రిగా పదవి చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం పండ్ల ప్యాకెట్‌ను ప్రత్యేకంగా గర్భిణులకు అందజేశారు. ఆస్పత్రిలో వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో మంత్రి ఆర్కే రోజా పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరాయంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా వెజిటబుల్ పలావు, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణస్వామి, పుష్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ మండపం పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న దేవదాయశాఖ అధికారులు

చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు): మండల కేంద్రమైన పెనుమూరులో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణ పనులను బుధవారం దేవదాయశాఖ అధికారులు ప్రారంభించారు. గ్రామం నడిబొడ్డున బస్టాండు సమీపంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయానికి చెందిన ఇనాం భూమి సర్వే నంబర్ 502–2 లోని 1.12 ఎకరాల విస్తీర్ణంలో కల్యాణ మండపాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి టీటీడీ అనుమతి పొందింది. దీంతో కల్యాణ మండప పనులను దేవదాయశాఖ ఈఓ తిమ్మారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఏకాంబరం, ఇన్‌చార్జ్ తహసీల్దారు విజయభాస్కర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ తిమ్మారెడ్డి మాట్లాడుతూ రూ.1.07 కోట్లతో కల్యాణ మండపం నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే శ్రీకోదండరామ స్వామి ఆలయ అభివృద్ధికి కూడా టీటీడీ సహకరిస్తుందని చెప్పారు.

ముమ్మరంగా తనిఖీలు

పాలసముద్రం : మండల పరిధిలోని తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో ద్విచక్రవాహనాల చోరీలు ఎక్కువ జరుగుతుండడంతో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన తన సిబ్బందితో కలిసి తమిళనాడు సరిహద్దులోని బలిజకండ్రిగ–షోలింగర్ జాతీయ రహదారిపై ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు లేని వాహనానికి జరిమానా వేశారు. అనంతరం ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ పలు ద్విచక్రవాహనాలకు రికార్డులు సరిగా లేకపోవడంతో, అలాగే అనుమానం ఉన్న కొందరిని మొత్తం ఏడుగురిని వాహనాలతో పాటు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు సీఎం జగనన్న

- పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం
- అభివృద్ధికి సహకరించండి
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: పేదల గుండె చప్పుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, కులమతాలకు అతీతంగా నవరత్నాలు అందించి పేదపాలిట దేవుడయ్యాడని ఉపముఖ్యమంత్రి కే.నారాయణస్వామి అన్నారు. బుధవారం మండలంలోని జక్కిదొన గ్రామ సచివాలయ పరిధిలోని ముతాలం, ఎగువ కనికాపురం, దిగువ కనికాపురం, నంబాలపల్లె, ఒంటిళ్లు, ఉప్పరపల్లె, జక్కిదొన ఆదిఆంధ్రవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొని గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గత ప్రభుత్వం పెత్తందారుల కోసం పనిచేస్తే సీఎం జగనన్న పేదవాళ్ల కోసం నిరంతరం ఆరాట పడుతున్నారని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు శ్మశాన వాటికలు లేకపోవడంతో సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే జీఓ ఇచ్చి శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని చెప్పారని గుర్తు చేశారు. ఏ గడప తొక్కినా జగనన్న అందిస్తున్న పథకాలతో సంతోషంగా ఉన్నామంటూ ప్రజలు తమ ఆనందంగా చెబుతున్నారని అన్నారు. తమ ప్రభుత్వం నవరత్నాలతో నవశకానికి నాంది పలికి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు చెప్పారు. ఎక్కడికెళ్లినా జగనన్నను అన్నగా, తమ్ముడిగా, కొడుకుగా భావిస్తున్నారంటే ఆయన ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. సంక్షేమ పాలన కావాలంటే మరోసారి మళ్లీ జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

అభివృద్ధికి సహకరించండి

గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని మంత్రి నారాయణస్వామి కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు విభేదాలను పక్కన పెట్టి అధికారులను సమన్వయం చేసుకుని ప్రజలకు మరింత సేవలందించాలన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు అందిస్తుంటే కొందరు ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను, ఆరోపణలను తిప్పి కొట్టి ప్రజలకు అండగా నిలబడాలని సూచించారు. అధికారులు సక్రమంగా పని చేసి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. శ్మశాన వాటికలు లేని గ్రామాల్లో వెంటనే ప్రభుత్వ భూములను గుర్తించి కేటాయించాలని ఆదేశించారు. అంతకుముందు ఆయన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ పుల్లారెడ్డి, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, బూత్ కమిటీ నియోజకవర్గ కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, ఎంపీటీసీలు మునిచంద్రారెడ్డి, చిన్నబ్బ, గుణశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, సర్పంచ్‌లు శ్రీనాథరెడ్డి, కావేరి, గోవిందయ్య, నాయకులు ధనంజయరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, బాబురెడ్డి, పెద్దబ్బరెడ్డి, గురవారెడ్డి, రోశిరెడ్డి, గోవిందన్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- సీఎం జగనన్నది రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా

నగరి : ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆదర్శవంతమైన పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మున్సిపల్ పరిధిలోని కాకవేడు సచివాలయ పరిధి 1వ వార్డులోని ధర్మాపురం, పాండురాజపురం, రాజీవ్ నగర్, నగరిపేట, కృష్ణానగర్, ఎంఎం కండ్రిగ గడప గడపకు మన ప్రభుత్వం, ×జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్× కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. లబ్ధిదారుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇంటి యజమాని అనుమతితో గోడపై, సెల్‌ఫోన్లపై స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికి ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తోందని వివరించారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లు

మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ స్కూళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులు కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి బాటలు వేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందడం కోసం 600 హామీలు ఇచ్చి చంద్రబాబులా ప్రజలను మోసం చేయలేదన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించాలని ప్రజలను కోరారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా జగనన్నను మరోసారి చేసుకుంటే సంక్షేమ పాలన కొనసాగిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ వెంకటరత్నం, బాలన్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సీడీపీఓ కృష్ణవేణి, గోపాల్‌రెడ్డి, రాజముత్తు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కుంభాభిషేకానికి విరాళం

నగరి : విజయపురం మండలంలోని ఆలపాకం పంచాయతీ పరిధిలోని వడ్డిండ్లు గ్రామ ప్రజలు నూతనంగా నిర్మించుకున్న గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ తరఫున మంత్రి ఆర్కే రోజా విరాళం అందించారు. బుధవారం తన నివాసం వద్ద గ్రామస్తులకు రూ.50 వేలను ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలకు ఆమె అందించారు. ఈ కార్యక్రమంలో విజయపురం మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉమమాహేశ్వరి

కార్వేటినగరం: వేసవికాలంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పుత్తూరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ గోవిందయ్య అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పాడిరైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పాడి ఆవులను ఉదయం 11 నుంచి 4 గంటల వరకు బయటకు వదలకూడదని సూచించారు. ఎండ వల్ల పాడి ఆవులకు వడదెబ్బతో పాటు పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. నగరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వాసు మాట్లాడుతూ ఎండకాలంలో తొలకరి వర్షాలకు ఆవులు ఎదకు వచ్చే అవకాశాలు ఎక్కువని, పాడి రైతులు సకాలంలో గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించుకోవాలన్నారు. పాడి పశువులకు తరచూ వ్యాపించే పొదుగు వాపు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, పశువైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. పొదుగు వాపుపై రైతులకు ఉన్న అపోహలను వీడి వైద్యం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, డాక్టర్ చైతన్య, డాక్టర్ హేమకుమార్, వీఎల్‌ఓ శశిధర్‌రెడ్డి, వీఏ రమేష్, ఏహెచ్‌ఎలు, రైతులు పలువురు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : మండలంలోని పాడి రైతులకు 49కొత్తపల్లిమిట్ట రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ (ఆత్మ) ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉమమాహేశ్వరి మాట్లాడుతూ దూడల పెంపకం, ఏడాదికి ఒక దూడ, పశుగ్రాసం, పొదుగు వాపు నివారణ, గాలికుంటు వ్యాధి నివారణకు చేపట్టవలసిన చర్యలను వివరించారు. ఆవులుకు అత్యవసర చికిత్స అందించడానికి ప్రభుత్వం పశు సంచార రథం ప్రవేశ పెట్టిందని, పాడి రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1962 ద్వారా అత్యవసర చికిత్స పొందవచ్చన్నారు. పాడి రైతులకు టీఎంటీ ఫీడ్‌ను రాయితీ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి శ్రీవిద్య, నందిని, సర్పంచ్ డీల్లయ్య, లీలావతి, హరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మంత్రి రోజా



తిరుమల ఆలయం వెలుపల మంత్రి ఆర్కే రోజా

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం మరికొందరు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా తదితరులు ఉన్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన గ్రామ సచివాలయ పరిధిలోని నచ్చుకూరు, నచ్చుకూరు ఎస్టీ కాలనీ, జక్కిదొన, జక్కిదొన దళితవాడ, గంటావారిపల్లె, బొట్లవారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు బుధవారం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ రేపు

శ్రీరంగరాజపురం : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రారంభిస్తారని జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ సీఎం చేతుల మీదుగా శుక్రవారం ఉదయం 10 గంటలకు విగ్రహం ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని దళిత సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కూలీలకు విరివిగా ఉపాధి పనులు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శివయ్య

చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు): వేసవి దృష్ట్యా కూలీలకు ఉపాధిహామీ పనులు విరివిగా కల్పిస్తున్నట్లు పెనుమూరు ఎంపీడీఓ శివయ్య తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని గుత్తావాండ్లవూరు, సాతంబాకం పంచాయతీల పరిధిలో చేపడుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ వేసవి కాలంలో చేపట్టే ఉపాధి హామీ పనులు అదనపు వేతనం కింద రోజుకు రూ.272 మేరకు అందిస్తున్నట్లు తెలియజేశారు. ఇందుకు అనుగుణంగా ఉపాధి సిబ్బంది కూడా కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనులకు వేతనాలు సకాలంలో అందుతున్నాయన్న విషయాన్ని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామం పరిధిలో కూలీలు ఉపాధి పనులను అడిగిన వెంటనే కల్పిస్తామన్నారు. పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



పుర వీదులలో రుక్మిణీ సత్యభామ శ్రీవేణుగోపాలుడు

కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న వసంతోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన, కొలువు తదితర నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. వంసతోత్సవం సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారిని వసంతమండపం వద్దకు వేంచేపు చేసి మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు వేదపండితులు ఉభయ దేవేరులకు పాలు, పెరుగు, చందనం, పసుపు, తేనె, నారికేళి వంటి ప్రత్యేక జలాలతో అత్యంత వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల మధ్య వేద పండితులు మంత్రాలను పఠిస్తూ స్వామివార్లకు ఆస్థానం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పాలతో, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు గోపాలాచారి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరిరక్షణపై అవగాహన



మట్టి నమూనాపై అవగాహన కల్పిస్తున్న మురళీకృష్ణ

గంగాధరనెల్లూరు: భూసార పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చిన్నవేపంజేరి రైతు భరోసా కేంద్రంలో బుధవారం వ్యవసాయాధికారులు, గ్రామవ్యవసాయ సహాయకులకు భూసార పరిరక్షణ, భూసార పరీక్షల మట్టినమూనాపై శిక్షణా కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనా తీసే పద్ధతి, భూసార పరీక్ష ఫలితాలపై అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. అలాగే చౌడు భూములు, పాలచౌడు, అమ్ల భూములను బాగు చేసే పద్ధతుల గూర్చి వివరించారు. భూసార పరీక్ష కోసం మట్టి సేకరణ 15–30 సెంటీమీటర్ల లోతులో తీయాల్సి ఉంటుందన్నారు. పలువురు రైతుల మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసే విధంగా అధికారులు రైతులకు వివరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తిరుపతి నుంచి విచ్చేసిన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవ్‌రామ్‌రెడ్డి, ఓడీఏ గోపాల్, హబీబ్‌బాషా, ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ఏఓ వందన, సర్పంచ్ ఝాన్సీ, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి



సమీక్షిస్తున్న కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి

పుత్తూరు రూరల్: మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి సూచించారు. బుధవారం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, ఇతర సేవల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని, సకాలంలో సేవలందించాలని సూచించారు. అలా నడుచుకోకపోయినా, అవినీతికి పాల్పడుతున్నట్లు తెలిసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కల్యాణపురం గ్రామస్తుల అభ్యర్థన మేరకు ప్రధాన వాటర్ పైపులైను నుంచి పంపిణీ లైన్లకు వాల్వ్‌లు అమర్చే పనులను పర్యవేక్షించారు. అలాగే ఆయన నందిమంగళం, కల్యాణపురం జగనన్న కాలనీలో పనులను పరిశీలించారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందన



మిట్టకండ్రిగ ఎస్టీకాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



వీఆర్‌కుప్పంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటిస్తున్న నాయకులు



అంబోదరపల్లిలో లబ్ధిదారుల నుంచి వివరాలను సేకరిస్తున్న బాబురెడ్డి

నింద్ర: మండలవ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బుధవారం స్థానిక మండల నాయకులు నింద్రలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. ప్రతి గడపకు, ఫోన్లకు స్టిక్కర్లను అతికించడం జరిగింది. లబ్ధిదారులు జగనన్న ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు పార్టీలకు అతీతంగా జగనన్నకు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారని అన్నారు. నింద్రలోని బీసీ కాలనీ, మిట్టకండ్రిగ ఎస్టీకాలనీ, కర్ఫరవేడు, చరవంబాకం గ్రామాల్లో కార్యక్రమాలు విజయవంతం చేశారు. వైస్ ఎంపీపీ శుభ, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, నాయకులు శ్యామ్‌లాల్, మేరి, అనిల్, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య పాల్గొన్నారు.

జీడీ నెల్లూరులో...

గంగాధరనెల్లూరు: మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అంబోదరపల్లిలో రైతు భరోసా కేంద్రం అడ్వైజర్ కమిటీ అధ్యక్షుడు బాబురెడ్డి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అడిగిన ప్రశ్నలకు ప్రజల వద్ద నుంచి జవాబులు రాబట్టారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అందువల్ల భవిష్యత్‌లోనూ మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ గాలి మహేష్ బాబు తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ గృహ సారథులు, వలంటీర్లతో కలసి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు, పోస్టర్లు అతికించారు. పాలసముద్రం పంచాయతీల్లో జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్, వెంగళరాజుకుప్పం పంచాయతీల్లో వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ, ఆముదాల పంచాయతీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఎంపీటీసీ లిఖిత, సర్పంచ్ అనురేఖ, బాలకృష్ణాపురం పంచాయతీల్లో సర్పంచ్ శోభ, త్యాగరాజు గ్రామాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి ఇంటి గోడలపై స్టిక్కర్ అతికించారు.

సంక్షేమ పథకాలే ప్రజలకు చేదోడు

వడమాలపేట : ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలకు చేదోడుగా నిలుస్తున్నాయని జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు అన్నారు. బుధవారం ఏఎంపురం, ఎస్‌బీఆర్ పురం సచివాలయాల పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్–జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో వారికి లబ్ధిదారులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగనన్న పేదలకు ఇళ్లు, పింఛన్లు, రైతు భరోసా, అమ్మఒడి, ఆసరా, విద్యాదీవెన ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న పథకాలు వల్ల లబ్ధి చేకూరుతుందా ? లేదా ? అని అడిగి తెలుసుకుని వారు చెప్పిన సమాధానాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామరాజు, సుబ్రమణ్యంరాజు, పీసీ చంద్రరాజు, ఉమాపతి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

నల్లమచ్చ నివారణకు సస్యరక్షణ చేపట్టండి



సూచనలిస్తున్న ఉద్యానవన అధికారి వెంకట సౌజన్య(ఇన్‌సెట్) మామిడికాయలపై నల్లమచ్చలు

పుత్తూరు రూరల్: ప్రస్తుతం మామిడి తోటల్లో కాయలపై నల్లమచ్చలు ఏర్పడుతున్నాయని, వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ఉద్యానవనశాఖ అధికారి వెంకట సౌజన్య కోరారు. బుధవారం పుత్తూరు మండలం కేబీఆర్ పురం గ్రామంలోని తోటలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా నారాయణవనం, వడమాలపేట, పుత్తూరు మండలాల్లోని తోటలను పరిశీలించగా దాదాపు ప్రతి తోటలో కాయలపై, తొడిమెలపైనా నల్లమచ్చ కనిపిస్తోందని తెలిపారు. దీని నివారణకు మాంకోజెబ్ 2 గ్రాముల మందును 1 లీటరు నీటితో కలిపి, లేదా కార్బండజిమ్ 1 గ్రాము లీటరు నీటితో లేదా తయోఫినేట్ మిథైల్ 1 గ్రాము లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఇలా 15 రోజులకు ఒకసారి 3 దఫాలుగా పిచికారీ చేయాలని చెప్పారు. అలాగే పూత, పిందె దశలో తేనెమంచు పురుగు, బంక సమస్య అక్కడక్కడా ఉందన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ.లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కాయలపై ఉన్న తేనెమంచు పురుగు, బంక సమస్య నివారణకు థయోమిథాక్సాం 0.3 గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఇలా సమస్యకు తగిన విధంగా సస్యరక్షణ చర్యలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు.